క్లుప్తంగా

నిరుపేదలకు రూ.5కే భోజనం అందించాలి

జనగామ రూరల్: పట్టణంలోని రైల్వేస్టేషన్, బస్టాండ్ ప్రాంతాల్లో నిరుపేదలు ఆకలితో అలమటిస్తున్నారని, వారి కోసం రూ.5కే భోజనం అందించాలని అమ్మ ఫౌండేషన్ సలహాదారుడు వంగభీమ్‌రాజ్ కోరారు. ఈ మేరకు కలెక్టర్ శివలింగయ్యకు శనివారం వినతిపత్రం అందజేశారు.

ఉన్నత స్థాయికి ఎదగాలి

చిల్పూరు: ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులు శ్రద్ధగా చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని, అదే తనకు ఇచ్చే బహుమతి అని మహాత్మా హెల్పింగ్ హ్యాండ్స్ స్వచ్ఛంద సంస్థ నిర్వాహకుడు గంట రవీందర్ అన్నారు. మండలంలోని రాజవరం సమీపంలోని కస్తూర్బాబాలికల విద్యాలయంలో 10వ తరగతి చదువుతున్న విద్యార్థులకు రూ. 10 వేల విలువ చేసే మోడల్ పేపర్లను శనివారం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్‌ఓ ప్రశాంతి అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు.

పరామర్శ

నర్మెట: మండలంలోని హన్మంతాపూర్ జీపీ పారిశుద్ధ్య కార్మికుడు ఇరుగు మల్లేష్ తండ్రి ఎల్లయ్య (80) అనారోగ్యంతో మృతిచెందాడు. కాగా, న్యాయవాది చింతల యాదయ్య అందించిన బియ్యం, నగదును శనివారం పండగ రమేశ్ బాధిత కుటుంబానికి అందించి పరామర్శించారు. వార్డు సభ్యులు ఇట్టబోయిన రామరాజు, యాట సంధ్యా క్రాంతికుమార్, గ్రామస్థులు వల్లాల లక్ష్మయ్య ఉన్నారు.

కేంద్ర పథకాలను వినియోగించుకోవాలి

బచ్చన్నపేట: కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను అర్హులు వినియోగించుకోవాలని సెంట్రల్ బ్యాంక్, ఏపీజీవీబీ మేనేజర్‌లు శివశంకర్, గురుప్రీత్‌సింగ్ అన్నారు. శనివారం మండల కేంద్రలోని గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద వికసిత్ భారత్ సంకల్ప్ యాత్రలో భాగంగా ప్రజలకు కేంద్ర పథకాలపై అవగాహన కల్పించారు. సర్పంచ్ వడ్డెపల్లి మల్లారెడ్డి, ఎంపీటీసీలు అల్వాల రాధ, నల్లగోని పుష్ప, ఏపీఎం నాగేశ్వర్‌రావు, జీపీ కార్యదర్శి అనిల్‌రాజ్ పాల్గొన్నారు.

కోల్‌కతాకు తరలిన టీఎన్‌జీఓస్ నాయకులు

జనగామ రూరల్: అఖిల భారత రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సమాఖ్య ఆధ్వర్యంలో సీపీఎస్ రద్దు, ఆదాయపరిమితి రూ.10 లక్షలకు పెంచాలని కోరుతూ మూడు రోజుల పాటు కోల్‌కతా నగరంలో జరుగుతున్న సమావేశాలకు జిల్లా టీఎన్‌జీఓస్ నాయకులు శనివారం తరలివెళ్లి పాల్గొన్నారు. రాష్ట్ర అధ్యక్షుడు మారం జగదీశ్వర్ ఆధ్వర్యంలో నాయకులు వెళ్లారు. జిల్లా అధ్యక్షుడు ఖాజాషరీఫ్, పెండ్యాల శ్రీనివాస్, స్టెల్లా, స్వరూప, మల్లిగారి మధు, అబ్బసాయిలు, విష్ణు, సైదా ఉన్నారు.

ప్రభుత్వ భూమిని పేదలకు పంచాలి

బచ్చన్నపేట: గోపాల్‌నగర్‌లోని ప్రభుత్వ భూమిని పేదలకు పంచాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు సుంచు విజేందర్ కోరారు. శనివారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో మండల కార్యదర్శి బెల్లంకొండ వెంకటేష్ అధ్యక్షతన నిర్వహించిన జనరల్ బాడీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ భూమిని కొందరు సేద్యం చేసుకుంటూ అక్రమంగా స్టేటస్‌కో ఆర్డర్ తెచ్చుకున్నారని ఆ ఆర్డర్‌ను రద్దు చేయాలని అన్నారు. ఇళ్ల నిర్మాణానికి స్థలాన్ని కేటాయించాలని తహసీల్దార్ విశాలాక్షికి వినతి పత్రం అందజేసినట్లు తెలిపారు. నర్సింహులు, కరుణాకర్, మల్లయ్య, శోభ, లక్ష్మి, నవనీత పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ గీత కార్మికుడి మృతి

చిల్పూరు: మండల కేంద్రానికి చెందిన జగిత్యాల సాంబరాజు (33) చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. ఈ నెల 18న సాంబరాజు రోజుమాదిరిగా కల్లు గీసేందుకు తాటి చెట్టు ఎక్కి ప్రమాదవశాత్తు మోకు జారి కింద పడడంతో తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు ఎంజీఎం ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని సర్పంచ్ రాజ్‌కుమార్, కల్లు గీత కార్మిక సంఘం మండల అధ్యక్షుడు గనగోని రమేష్, గౌడ సంఘం అధ్యక్షుడు శ్రీనివాస్, స్వామి, రాజు, ప్రవీణ్, సునయ్ కోరారు.

కేసు నమోదు

తరిగొప్పుల: ఎలాంటి ప్రభుత్వ అనుమతులు లేకుండా మట్టిని తరలిస్తున్న ముగ్గురు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై దూదిమెట్ల నరేష్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. చిల్పూరు మండలం తీగలతండా శివారు గిర్నితండాకు చెందిన భూక్య వెంకటేష్, బదావత్ తిరుపతి మండలకేంద్రం శివారు అబ్దుల్‌నాగారం రోడ్డులోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయం సమీపంలోని మట్టిని టిప్పర్‌తో అక్రమంగా తరలిస్తుండగా అదుపులోకి తీసుకోవడం జరిగిందన్నారు. సదరు టిప్పర్ యజమానులతో పొక్లెయినర్ డ్రైవర్ జాహిద్ ఖాన్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. రెండు టిప్పర్లు, ఒక పొక్లెయినర్‌ని సీజ్ చేసినట్లు ఎస్సై నరేష్ తెలిపారు.

కొనసాగుతున్న 'ప్రజా పాలన'



నర్మెట: వెల్దండలో దరఖాస్తు స్వీకరిస్తున్న అధికారులు



జనగామ: కౌన్సిలర్ లక్ష్మి ఆధ్వర్యంలో..



జనగామ: కాంగ్రెస్ నాయకుడు ప్రభాకర్ ఆధ్వర్యంలో..



చిల్పూరు: మాట్లాడుతున్న కొర్నేలియస్

జనగామ: ప్రజాపాలనలో భాగంగా అభయహస్తం దరఖాస్తుల స్వీకరణ పట్టణంతోపాటు, గ్రామాల్లో కొనసాగుతోంది. శనివారం పట్టణంలోని 12వ వార్డు కౌన్సిలర్ గుర్రం భూలక్ష్మీనాగరాజు ప్రజలకు అందుబాటులో ఉండి దరఖాస్తులు చేయించారు. 3వ వార్డులో కాంగ్రెస్ నాయకుడు మోర్తాల ప్రభాకర్ ఆధ్వర్యంలో దరఖాస్తులు అందజేశారు.

పథకాలు అర్హులకు అందించేందుకు చర్యలు

దేవరుప్పుల: తెలంగాణ ప్రభుత్వం తలపెట్టిన ప్రజాపాలన పథకాలను అర్హులకు అందించేందుకు దరఖాస్తుల స్వీకరణ చర్యలు చేపడుతున్నట్లు డీపీఓ రంగాచారీ అన్నారు. మండల కేంద్రంతోపాటు మున్‌పహాడ్, చౌడూరు, కోలుకొండ గ్రామాల్లో దరఖాస్తుల స్వీకరణను ప్రజాప్రతినిధులు ప్రారంభించారు. దేవరుప్పులలో 1,520 దరఖాస్తులు అందించగా 901 నమోదు చేసుకొని మూడు రోజుల నమోదులో ఇక్కడ అగ్రభాగాన నిలిచారు. 188 ఇతరతర సమస్యలపై వినతి పత్రాలు అందించారు. సర్పంచ్‌లు ఈదునూరి రమాదేవి, మధు, ప్రమీల, రవి, పీఏసీసి డైరెక్టర్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పెద్ది కృష్ణమూర్తి, ఎంపీడీఓ ఉమామహేశ్వర్, తహసీల్దార్ హుస్సేన్, ఆర్‌అండ్‌బీ ఈఈ హుస్సేన్, డీఈఓ కె రాము, ఎంపీఓ సురేష్‌కుమార్, ఆర్‌ఐలు ఆంధ్రయ్య, రాజు, రవీందర్ పాల్గొన్నారు.

శామీర్‌పేటలో..

జనగామ రూరల్: అభయహస్తం కార్యక్రమంలో ప్రభుత్వ పథకాలకు దరఖాస్తు చేసుకొని సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ మేకల కళింగ రాజు అన్నారు. శామీర్‌పేటలో దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. జెడ్పీ సీఈఓ అనిల్, తహసీల్దార్ మహిపాల్, ఎంపీడీఓ హసీం, ప్రత్యేక అధికారి చౌడేశ్వరీ, టీం ఆఫీసర్ సంపత్‌కుమార్ పాల్గొన్నారు.

జఫర్‌గఢ్‌లో..

జఫర్‌గఢ్: ప్రజాపాలనలో భాగంగా అభయహస్తం దరఖాస్తుల స్వీకరణకు మండలంలోని రేగడితండా, హిమ్మత్‌నగర్, తిమ్మంపేటలో గ్రామ సభలను నిర్వహించారు. తిమ్మంపేటలో జరిగిన గ్రామసభలో జెడ్పీటీసీ ఇల్లందుల బేబి శ్రీనివాస్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అర్హులకు సంక్షేమ పథకాలు అందేలా చూడాలని అధికారులకు సూచించారు. తహసీల్దార్ ఆంజనేయులు, ఎంపీడీఓ శ్రీధర్‌స్వామి, సర్పంచ్‌లు భూక్య శ్రీదేవి రవి, తాటికాయల ఆశోక్, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజాపాలనను సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాపాలనను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ సింగపురం ఇందిరా కోరారు. తిమ్మంపేటలో నిర్వహించిన ప్రజాపాలన గ్రామసభలో ఆమె పాల్గొని మాట్లాడారు. అన్నెబోయిన భిక్షపతి, కట్టా మనోజ్ రెడ్డి, సిహెచ్ కృష్ణమూర్తి, పార్టీ మండల అధ్యక్షుడు నూకల ఐలయ్య తదితరులు పాల్గొన్నారు.

వెల్దండలో..

నర్మెట: ప్రజాపాలనలో భాగంగా మూడో రోజు శనివారం అధికారులు వెల్దండలో ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. కార్యక్రమంలో సర్పంచ్ నర్రా వెంకట రమణారెడ్డి, ఎంపీపీ తేజావత్ గోవర్ధన్, జెడ్పీటీసీ మాలోత్ శ్రీనివాస్, వైస్ ఎంపీపీ మంకెన ఆగిరెడ్డి, మండల ప్రత్యేక అధికారి దామోదర్ రావు, డీఎం సివిల్ సప్లై ప్రసాద్, ఎంపీడీఓ ఎండి. ఖాజామొహినుద్దీన్, తహసీల్దార్ మున్ననూరి వెంకన్న పాల్గొన్నారు. కాగా, 950 దరఖాస్తులు అందినట్లు అధికారులు తెలిపారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

కొడకండ్ల: ప్రజాపాలన కార్యక్రమంలో అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వం సంక్షేమ పథకాలు అందిస్తుందని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ధరావత్ సురేష్‌నాయక్ అన్నారు. శనివారం మండలంలోని రామవరంలో నిర్వహించిన ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమాన్ని ఆయన సందర్శించి మాట్లాడారు. తహసీల్దార్ అంజయ్య, సర్పంచ్ శిరీష, ఎంపీటీసీ మణెమ్మ పాల్గొన్నారు.



లింగాలఘణపురం: నెల్లుట్లలో దరఖాస్తు ప్రక్రియను పరిశీలిస్తున్న డీఎల్‌పీఓ పార్థసారథి

అందరి దరఖాస్తులు తీసుకుంటాం..

చిల్పూరు: అందరి దరఖాస్తులు పూర్తయ్యే వరకు తీసుకుంటామని, ఆందోళన చెందొద్దని మండల ప్రత్యేకాధికారి కొర్నేలియస్ అన్నారు. వంగాలపల్లి, నష్కల్, ఫత్తేపూర్, గార్లగడ్డతండాల్లో కొనసాగుతున్న ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణను ఆయన సందర్శించారు. సర్పంచ్‌లు అరూరి ప్రణిత, కర్ణకంటి స్వప్న, రూప్లానాయక్, తులసి, ఎంపీటీసీలు పాశం శిరీష, భూక్య సరిత, అధికారులు తహసీల్దార్ సరస్వతి, ఎంపీడీఓ వేణుగోపాల్‌రెడ్డి, ఎంపీఓ మధుసూదన్, ఐకేపీ ఏపీయం రమేష్‌కుమార్, ఆర్ఐ శ్రీనివాస్, సుధాకర్ ఉన్నారు.

సమస్యలుంటే తెలియజేయండి

అభయహస్తం దరఖాస్తుల విషయంలో ఏమైనా సమస్యలుంటే తనకు తెలియజేయాలని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ సింగపురం ఇందిర అన్నారు. మండలంలోని నష్కల్‌లో దరఖాస్తుదారులతో ఆమె మాట్లాడారు.

మూడో రోజు 1,563 దరఖాస్తులు

లింగాలఘణపురం: మండలంలో మూడో రోజు శనివారం అభయహస్తం ఆరు గ్యారంటీలకు 1,563 దరఖాస్తులు వచ్చాయి. క్లాంలో 721, చీటూరులో 345 దరఖాస్తులు రాగా నెల్లుట్ల, కుందారం, వనపర్తి, కొత్తపల్లి, నాగారం, మంథోనిగూడెంలో 493 దరఖాస్తులు వచ్చాయి. నెల్లుట్లలో డీఎల్‌పీఓ పార్థసారథి దరఖాస్తుల ప్రక్రియను పరిశీలించారు. క్లాంలో కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ సింగరపురం ఇందిర పాల్గొని కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన మాటకు కట్టుబడి ఆరు గ్యారంటీలకు దరఖాస్తులు తీసుకుంటుందన్నారు.

అర్హులందరూ దరఖాస్తు చేసుకోవాలి

రఘునాథపల్లి: ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను పొందడానికి అర్హులైన ప్రతి ఒక్కరూ దరఖాస్తు చేసుకోవాలని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ సింగపురం ఇందిర సూచించారు. మండలంలోని ఫతేషాపూర్‌లో ఆమె ప్రజాపాలన దరఖాస్తు కేంద్రాలను పరిశీలించారు. ఎంపీపీ మేకల వరలక్ష్మి, ఎంపీడీఓ హసీం, సర్పంచ్ ఎండీ హయతలీ, మండల పరిషత్ కోఆప్షన్ సభ్యుడు ఎండీ షబ్బీర్, సొసైటీ డైరెక్టర్ గొట్టం కరుణాకర్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి మహేష్, నర్సింహ పాల్గొన్నారు.

బచ్చన్నపేట: మండలంలోని చిన్నరామన్‌చర్ల, గోపాల్‌నగర్ గ్రామాల్లో తహసీల్దార్ విశాలాక్షి, కొన్నె, దబ్బగుంటపల్లిలో ఎంపీడీఓ రఘురామకృష్ణలు ప్రజాపాలన కార్యక్రమాన్ని నిర్వహించి ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. సర్పంచ్‌లు వేముల వెంకట్‌గౌడ్, ఖలీల్‌బేగం, ముక్కెర కరుణాకర్‌రెడ్డి, పర్వతం మధుప్రసాద్, ఎంపీటీసీ మల్గ నర్సవ్వ, కవిత, సంతోష్, పాల్గొన్నారు.



జనగామ రూరల్: మాట్లాడుతున్న ఎంపీపీ కళింగరాజు



జఫర్‌గఢ్: తిమ్మంపేటలో మాట్లాడుతున్న బేబి



బచ్చన్నపేట: కొన్నెలో..



కొడకండ్ల: మాట్లాడుతున్న సురేష్‌నాయక్

ఆటా ఫైనల్‌లో ఎమ్మెల్యే 'పల్లా'



జనగామ: అమెరికా తెలుగు అసోసియేషన్ (ఆటా)ఆధ్వర్యంలో హైదరాబాద్ రవీంద్రభారతిలో శనివారం రాత్రి నిర్వహించిన ఆటా–2023 గ్రాండ్ ఫైనల్ ప్రోగ్రాంలో ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి పాల్గొన్నారు. సాంస్కృతిక, ఎడ్యుకేషనల్ కేటగిరీలో ప్రతిభ కనబరిచిన వారికి అవార్డుల ప్రదానంతో పాటు సాహిత్య పరమైన కార్యక్రమాలను నిర్వహించారు.

ప్రశాంతంగా న్యూ ఇయర్ వేడుకలు నిర్వహించుకోవాలి



తరిగొప్పుల: నూతన సంవత్సర వేడుకలు మండల ప్రజలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని ఎస్సై దూదిమెట్ల నరేష్ సూచించారు. శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పిల్లలు, యువత, పెద్దలు ఉత్సాహంగా న్యూ ఇయర్ వేడుకలు జరుపుకోవాలని, అవాంఛనీయ సంఘటనలు జరగకుండా తగు చర్యలు తీసుకుంటామని అన్నారు. రోడ్లపై నిర్లక్ష్యంగా అధిక వేగంతో, పెద్ద శబ్దాలు చేస్తూ వాహనాలు నడుపుతూ సామాన్య ప్రజలకు ఇబ్బందులు కలిగే విధంగా వ్యవహరించరాదని సూచించారు. 31న సాయంత్రం నుంచే డ్రంకెన్‌డ్రైవ్ నిర్వహిస్తామని, మైనర్లకు వాహనాలు ఇచ్చే యజమానులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

తరిగొప్పుల: రెయిన్‌బో యూత్ అసోసియేషన్–2024 నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఎస్సై దూదిమెట్ల నరేష్ శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ రెయిన్‌బో యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో చేస్తున్న సేవలు అభినందనీయమన్నారు. అధ్యక్షుడు అంకం రాజు, జొన్నగోని రవీందర్, జొన్నగోని రాజు, మిండ్లాపురం తరుణ్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం

జనగామ రూరల్: అత్యవసర సమయాల్లో రక్తదానం చేయడం ప్రాణదానంతో సమానమని అమ్మ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు మంతెన మని అన్నారు. శనివారం ఫౌండేషన్ ఆధ్వర్యంలో పట్టణానికి చెందిన సభాని శ్రీధర్ రక్తదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఆరు నెలలకు ఒక్కసారి రక్తదానం చేయాలని అన్నారు. అమ్మ టీం సభ్యులు పాల్గొన్నారు.

ఎంపీ టికెట్ 'కొమ్మూరి'కే ఇవ్వాలి



నర్మెట: మాట్లాడుతున్న నర్సింహారెడ్డి

నర్మెట: రానున్న పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా భువనగిరి కాంగ్రెస్ టికెట్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్ రెడ్డికి కేటాయించాలని జిల్లా కార్యదర్శి గంగం నర్సింహారెడ్డి కోరారు. కన్నెబోయిన రామకృష్ణ అధ్యక్షతన శనివారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఏకగ్రీవ తీర్మానం అనంతరం ఆయన మాట్లాడారు. ఇప్పటి వరకు ఆ జిల్లాకు చెందిన వారికే టికెట్ ఇచ్చారని మాజీ ఎమ్మెల్యేగా, జిల్లా అధ్యక్షుడిగా అనుభవమున్న ప్రజాదరణ కలిగిన వ్యక్తి కొమ్మూరి అని పీసీసీ అధ్యక్షుడు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, గౌరవ అధ్యక్షురాలు సోనియాగాంధీ ఒక్కసారి ఆలోచించాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో మాజీ జెడ్పీటీసీ గాదె మోహన్‌రెడ్డి, పీఏసీఎస్ డైరెక్టర్ కూకట్ల చంద్రమౌళి, ఓబీసీ సెల్ అధ్యక్షుడు బండి అశోక్, కిసాన్ సెల్ అధ్యక్షుడు చెవుల పరశరాములు, యూత్ అధ్యక్షుడు ప్రజ్ఞాపురం శ్రీధర్, సీనియర్ నాయకులు సరాబు మధు, ముద్దం గట్టయ్య, భూపతిరెడ్డి, కరుణాకర్ పాల్గొన్నారు.

తరిగొప్పుల: రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో భువనగిరి పార్లమెంట్ ఎంపీ టికెట్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డికి కేటాయించాలని మండల కోఆర్డినేటర్ వగలబోయిన యాదగిరి అదిష్టానాన్ని కోరారు. మండలకేంద్రంలో ఏర్పాటు చేసిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. నియోజకవర్గం మరింత అభివృద్ధి చెందాలంటే స్థానికుడైన కొమ్మూరి వల్లనే సాధ్యమవుతుందని అన్నారు. ఇంద్రారెడ్డి, మదాసు భిక్షపతి, లూకా, పోషయ్య, సత్తయ్య,వీరన్న, రమేష్, అంజిరెడ్డి, సుధాకర్, చంద్రయ్య, నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

ప్రతాప్‌రెడ్డికి ఎంపీ టికెట్ కేటాయించాలి

బచ్చన్నపేట: డీసీసీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కొమ్మూరి ప్రతాప్‌రెడ్డికి వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో భువనగిరి ఎంపీ టికెట్ కేటాయించాలని జిల్లా కాంగ్రెస్ నాయకుడు, సింగిల్ విండో మాజీ చైర్మన్ జిల్లెల్ల సిద్దారెడ్డి అన్నారు. శనివారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడారు.

మల్లన్నగండి జాతర చైర్మన్‌గా మహేందర్



కోరుకొప్పుల మహేందర్

స్టేషన్‌ఘన్‌పూర్: మండలంలోని తాటికొండ–జిట్టెగూడెం గ్రామ పంచాయతీల పరిధిలోని మల్లన్నగండి సమ్మక్క–సారలమ్మ జాతర చైర్మన్‌గా తాటికొండ గ్రామానికి చెందిన కోరుకొప్పుల మహేందర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యాడు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రెండు గ్రామాల ప్రజాప్రతినిధులు, నాయకులు, ప్రజలు, అన్ని కుల సంఘాల సహకారంతో ఫిబ్రవరిలో నిర్వహించే జాతరను జయప్రదం చేస్తానని అన్నారు. దీంతో పాటు కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి సింగపురం ఇందిర సహకారంతో వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సౌకర్యాల కల్పనకు కృషిచేస్తానన్నారు. అనంతరం నూతనంగా ఎన్నికైన చైర్మన్‌ను ఘనంగా సన్మానించారు.

జాతర వేలం ఆదాయం రూ.12.62 లక్షలు

తాటికొండ–జిట్టెగూడెం గ్రామాలకు సంబంధించిన సమ్మక్క–సారలమ్మ జాతరలో వివిధ దుకాణాల ఏర్పాటుకు శనివారం గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద వేలం నిర్వహించగా రూ. 12.62 లక్షలు ఆదాయం వచ్చింది. ఉదయం రెండు గ్రామాల సర్పంచ్‌లు చల్లా ఉమాసుధీర్‌రెడ్డి, మాలోత్ లలిత, వైస్ ఎంపీపీ సుధీర్‌రెడ్డి, జెడ్పీటీసీ మారపాక రవి, జాతర చైర్మన్ కోరుకొప్పుల మహేందర్ ఆధ్వర్యంలో వేలం నిర్వహించారు. వేలంలో తాటికొండకు చెందిన వారు పాల్గొని దక్కించుకున్నారు. ఎడమ రవి రూ. లక్షకు కొబ్బరికాయల విక్రయం, కుసుమ రమేశ్ రూ.1.31లక్షకు బెల్లం విక్రయం, దామెర శ్రీనివాస్ రూ. 4.16లక్షలకు కోళ్లు, మారపాక కర్ణాకర్ రూ. 6.15లక్షలకు మద్యం దక్కించుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ దూదిపాల నరేందర్‌రెడ్డి, ఉప సర్పంచ్‌లు రాములు, రవీందర్, సుమన్‌నాయక్ తోపాటు తదితరులు పాల్గొన్నారు.

ప్రధాని నాయకత్వంలో సంక్షేమ పాలన



మాజీ ఎంపీని సత్కరిస్తున్న నాయకులు

జనగామ: దేశంలో ప్రధాన మంత్రి నరేంద్రమోదీ నాయకత్వంలో సంక్షేమ పాలన సాగుతుందని భువనగిరి మాజీ పార్లమెంట్ సభ్యుడు, పీఎం విశ్వకర్మ యోజన రాష్ట్ర కన్వీనర్ బూర నర్సయ్య గౌడ్ అన్నారు. శనివారం బీజేపీ జిల్లా కార్యాలయంలో ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు గుజ్జుల నారాయణ అధ్యక్షతన జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఉజ్వల యోజన, సుకన్య యోజన, ఆయుష్మాన్ భారత్, ప్రధానమంత్రి పెన్షన్ యోజన, చేతివృత్తుల అభివృద్ధికి పీఎం విశ్వకర్మ యోజన లాంటి అనేక పథకాలను అమలు చేస్తోందన్నారు. నాయకులు విద్యాసాగర్ రెడ్డి, యు.రమేష్, ఎస్.రమేష్, శివరాజ్, బల్ల శ్రీనివాస్, ఎం.హరిచంద్రగుప్త, కె.శ్రీనివాస్ పాల్గొన్నారు.

చదువుతోపాటు క్రీడల్లో రాణించాలి



క్రీడాకారులకు కిట్లు బహూకరిస్తున్న సర్పంచ్ శివకుమార్

రఘునాథపల్లి: యువత చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని జిల్లా సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు పోకల శివకుమార్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఆయన స్థానిక క్రీడాకారులకు క్రికెట్, వాలీబాల్ కిట్లు బహూకరించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ క్రీడలపై అసక్తిగల యువతకు తన వంతు సహాయ సహకారాలు అందిస్తానన్నారు. క్రీడల్లో నైపుణ్యత చాటి గ్రామానికి పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని ఆయన సూచించారు. జీపీ కార్యదర్శి కవిత, ఉప సర్పంచ్ రాములు, కోఆప్షన్ సభ్యుడు లింగారెడ్డి రాయపురెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా అయోధ్య అక్షింతల శోభాయాత్ర



జఫర్‌గఢ్: శోభాయాత్రలో పాల్గొన్న మహిళలు



జఫర్‌గఢ్: శోభాయాత్రలో శ్రీధర్‌రావు

చిల్పూరు/జఫర్‌గఢ్: స్టేషన్‌ఘన్‌పూర్, శివునిపల్లి, చిల్పూరు, జఫర్‌గఢ్ గ్రామాల్లో శనివారం అయోధ్య అక్షింతల శోభాయాత్రను ఘనంగా నిర్వహించారు. అయోధ్య నుంచి వచ్చిన అక్షింతలతో విశ్వహిందూ పరిషత్, భజరంగదళ్, హిందూ భక్తుల ఆధ్వర్యంలో శోభాయాత్రను నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో కన్వీనర్ డాక్టర్ అంబటి హేమంత్, నష్కల్ సర్పంచ్ కర్ణకంటి స్వప్నవెంకటేష్, గంటె ఉపేందర్, మోడెం స్వామి, మోడెం భిక్షపతి, అంబటి కిషన్ రాజు, రేవూరి రమేష్, అంచూరి యుగేంధర్, గందె సోమన్న, శ్రవణ్, అంచూరి శ్రీరాములు, బెలిదే పుర్ణం చందర్, బజ్జూరి చలమయ్య, దాంశెట్టి సోమన్న, దొడ్డ రాజ్‌కుమార్ పాల్గొన్నారు. కాగా, చిల్పూరు మండలంలోని పల్లగుట్టలో నిర్వహించిన శోభాయాత్రలో చిల్పూరు ఆలయ శాశ్వత దాత పొట్లపల్లి శ్రీధర్‌రావు అక్షితల కలశాన్ని ఎత్తుకొని యాత్రలో పాల్గొన్నారు. శ్రీనివాస్, శ్యాంసుందర్ రెడ్డి, జయపాల్‌రెడ్డి, జయప్రకాష్ పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిక



కృష్ణారెడ్డిని పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఇందిర

రఘునాథపల్లి: మండలంలోని అశ్వరావుపల్లికి చెందిన రైతు సమన్వయ సమితి కన్వీనర్, బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు నిమ్మ కృష్ణారెడ్డి తన అనుచరులతో కలిసి కాంగ్రెస్‌లో చేరారు. శనివారం ఫతేషాపూర్‌లో కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ సింగపురం ఇందిర సమక్షంలో ఆయన కాంగ్రెస్‌లో చేరగా పార్టీ కండువా వేసి సాదరంగా ఆహ్వానించారు. సీఎం రేవంత్‌రెడ్డి ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాలకు ఆకర్షితుడినై కాంగ్రెస్‌లో చేరినట్లు కృష్ణారెడ్డి తెలిపారు. మండలంలో పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు. ఎంపీపీ మేకల వరలక్ష్మి, కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు లింగాల జగదీష్‌చందర్‌రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కోళ్ల రవిగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ చలాన్లు చెల్లించాలి

పాలకుర్తి: వాహనదారులు గడువులోగా పెండింగ్ చలాన్లు చెల్లించాలని పాలకుర్తి సీఐ విశ్వేశ్వర్, ఎస్సై తాళ్ల శ్రీకాంత్ అన్నారు. ఈ మేరకు వారు వాహనదారులకు పెండింగ్ చలాన్ల చెల్లింపుల్లో రాయితీపై శనివారం అవగాహన కల్పించారు. రాయితీని పొందేందుకు 2024 జనవరి 10వ తేదీలోపు పెండింగ్ ఈ చలాన్లను మీ–సేవా కేంద్రం , పేటీఎం, టి.ఎస్ ఆన్‌లైన్ ద్వారా చెల్లించొచ్చునని తెలిపారు. వాహనదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.

పోలీసుల అదుపులో మేకల దొంగ

లింగాలఘణపురం: మండలంలోని జీడికల్‌లో శనివారం దొంగతనంగా మేక, గొర్రెలను ఎత్తుకొచ్చి విక్రయిస్తుండగా బాధిత రైతులు గుర్తించి దొంగను పట్టుకొని పోలీసులకు అప్పగించారు. సంఘటనకు సంబంధించి వివరాలిలా ఉన్నాయి. పాలకుర్తి మండలంలోని తొర్రూరుకు చెందిన ఓ వ్యక్తి గొర్రెల దొడ్డిలో మేక, గొర్రె పోతును శుక్రవారం రాత్రి మండలంలోని మంథోనిగూడెం, చిక్కులోనిగూడేనికి చెందిన ఇద్దరు వ్యక్తులు దొంగతనంగా తీసుకొచ్చి శనివారం జీడికల్ అంగడిలో విక్రయించేందుకు ప్రయత్నించారు. తొర్రూరుకు చెందిన మేక, గొర్రెలు పోయిన వ్యక్తి శనివారం జీడికల్‌లో అంగడి ఉంటుందని అక్కడ ఏమైనా విక్రయించే ప్రయత్నం చేస్తారనే అనుమానంతో వచ్చారు. అంగడిలో తిరుగుతూ సదరు మేక, గొర్రె పోతులను గుర్తించి తమవేనని నిర్ధారణ చేసుకొని బేరమాడినట్లు నటించి వారిని పట్టుకొనేందుకు ప్రయత్నించారు. ఇంతలోనే తమ బండారం బయటపడిందని భావించిన దొంగలు పారిపోయేందుకు పరిగెత్తుతుండగా, వారిని వెంబడించగా మంథోనిగూడేనికి చెందిన కరుణాకర్ అనే వ్యక్తిని పట్టుకోగా మరో వ్యక్తి పారిపోయాడు. పట్టుకున్న వ్యక్తిని పోలీసులకు అప్పగించారు. అనంతరం పారిపోయిన వ్యక్తితో పాటు మరో వ్యక్తిని కూడా పోలీసులు అదుపులోకి తీసుకొని విచారణ జరుపుతున్నారు. పాలకుర్తి మండలం తొర్రూరు పరిధిలో మేక, గొర్రెపోతు దొంగతనం జరుగగా అక్కడి పోలీసులకు అప్పగించారు.

సమాజహితం కోసం పాటుపడాలి



ప్రార్థనలు చేస్తున్న ఫాదర్, ప్రతినిధులు

దేవరుప్పుల: క్రైస్తవ భక్తులు ఏసు మార్గదర్శకాలు ఆచరిస్తూ సమాజహితం కోసం పాటుపడాలని ఫాదర్ ఆరోగ్యరెడ్డి సూచించారు. శనివారం మండలంలోని కడవెండిలో తిరుకుటుంబం చర్చి 115వ ఆవిర్భావ ఉత్సవాలు పురస్కరించుకొని మతగురువులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో ఫాదర్ జోసఫ్, పీటర్, జోసఫ్, జయరాజ్, తిరుకుటుంబం చర్చి ప్రతినిధులు లీనారెడ్డి, ప్రతాప్‌రెడ్డి, జార్టీరెడ్డి, రఫేల్‌రెడ్డి, అంజిలి రెడ్డి, మెట్టు మర్రెడ్డి, కిరణ్‌రెడ్డి, రాజారెడ్డి తదితరులు పాల్గొన్నారు.